# తమిళ దర్శకుడి కథకు గ్రీన్‌సిగ్నల్?



వంద సినిమాల మార్క్ అందుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టున్నారు రవితేజ. ప్రస్తుతం ఆయన 75వ సినిమా షూటింగ్ జరుగుతున్నది. సితార ఎంటర్టైన్మెంట్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి భాను భోగవరపు దర్శకుడు. ఈ సినిమాకు 'దావత్' అనే టైటిల్‌ను అనుకుంటున్నారు. ఇదిలావుంటే.. ఈ సినిమా నిర్మాణంలో ఉండగానే మరో సినిమాకు రవితేజ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారట. తమిళ దర్శకుడు సి.సుందర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారని సమాచారం. ఖుష్బూ నిర్మాతగా వ్యవహరిస్తారట. సుందర్.సి గత కొన్నేళ్లుగా ఈ సినిమా కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారట. ఎట్టకేలకు రవితేజ నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతో ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కడానికి రెడీ అయ్యిందని సమాచారం. ఇది రవితేజ 76వ చిత్రంగా రానున్నదని తెలుస్తున్నది. హారర్, థ్రిల్లర్ కామెడీ కథలను తెరకెక్కించి వైవిధ్యమైన దర్శకుడిగా సుందర్.సి పేరు తెచ్చుకున్నారు. మరి రవితేజతో ఆయన చేయబోయే సినిమా ఏ జానరో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.



# ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నా

కెరీర్ ఆరంభంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నానని, అయినా పట్టుదలతో ఇండస్ట్రీలో నిలదొక్కుకున్నానని చెప్పింది త్రిప్తి డిమ్రి. 'యానిమల్' చిత్రం ద్వారా యూత్‌లో తిరుగులేని క్రేజ్‌ను సంపాదించుకున్న ఈ భామ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉంది. ఇటీవలే 'బ్యాడ్ న్యూజ్' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించింది. ఈ సందర్భంగా ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ తొలినాటి రోజుల్ని గుర్తుచేసుకుంది. ' నాకు చదువుపై అంతగా ఆసక్తి ఉండేది కాదు. దాంతో మోడలింగ్ వైపు అడుగుపెట్టా. పేరెంట్స్ కూడా సినిమాల్లోకి వెళతానంటే అంగీకరించలేదు. ఇండస్ట్రీ కొచ్చిన తొలినాళ్లలో ఏ విషయం మీద అవగాహన ఉండేది కాదు. దాంతో నా సహచర నటీనటులతో సన్నివేశం గురించి చర్చించేదాన్ని. ఒకానొక సమయంలో ఇండస్ట్రీకి వచ్చి సరైన నిర్ణయం తీసుకున్నానా? లేదా? అనే సందిగ్ధంలో పడ్డాను. 'లైలా మజ్ను' షూటింగ్ టైమ్‌లో సెట్స్‌లో ఏడ్చాను. వాళ్లు ఏం చెబుతున్నారో, ఆ భాష ఏమిటో అర్థమయ్యేది కాదు. దాంతో ఇంటికెళ్లి రాత్రిళ్లు డైలాగ్స్ ప్రాక్టీస్ చేశాను. ఎలాగో నా ప్రారంభ కష్టాల నుంచి గట్టెక్కి విజయాలను దక్కించుకున్నా' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ భామ మూడు సినిమాలతో బిజీగా ఉంది.

# కర్ణుడిగా సూర్య?



తమిళస్టార్ హీరో సూర్య బాలీవుడ్‌లో అడుగుపెట్టనున్నారని, సీనియర్ బాలీవుడ్ డైరెక్టర్ రాకేష్ ఓంప్రకాష్ మెహ్రా దర్శకత్వంలో సూర్య నటించనున్నారనీ.. ఓ వార్త బీటౌన్‌లో బలంగా వినిపిస్తున్నది. ఈ విషయంపై దర్శకుడు రాకేష్ ఓం ప్రకాశ్ మెహ్రా ఇఫా వేదికగా క్లారిటీ ఇచ్చారు. ఈ వార్తలు నిజమేనని, ప్రస్తుతానికి ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్నదని, సమయం వచ్చినప్పుడు అధికారికంగా వెల్లడిస్తానని ఓం ప్రకాశ్ మెహ్రా తెలిపారు. అందుతున్న సమాచారం ప్రకారం.. మహాభారతం ఆధారంగా రాకేష్ ఈ కథ రాసుకున్నారట. ఈ సినిమాకు 'కర్ణ' అనే టైటిల్ కూడా ఆయన ఖరారు చేసినట్టు సమాచారం. 500కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ సినిమాలో కర్ణుడిగా సూర్య నటించనున్నట్టు గత కొంతకాలంగా బాలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయ్. రంగ్‌దే బసంతి, ఢిల్లీ 6, బాగ్ మిల్ఖా బాగ్, తుఫాన్ వంటి చిత్రాలతో గొప్ప దర్శకునిగా గుర్తింపు తెచ్చుకున్న ఓం ప్రకాశ్ మిశ్రా.. సూర్యతో సినిమా చేస్తున్నారన్న వార్త సూర్య అభిమానులకు ఆనందాన్ని అందిస్తుంటే.. ఆ సినిమాలో సూర్య కర్ణుడిగా నటిస్తున్నాడనే వార్త ఆ ఆనందాన్ని మిన్నంటేలా చేస్తున్నది.

# ట్రెండ్‌కు తగినట్టుగా తీశా!

తెలుగు చిత్రసీమలో దర్శకుడు శ్రీనువైట్ల శైలి చాలా ప్రత్యేకం. యాక్షన్ కథాంశాలకు చక్కటి వినోదాన్ని జోడించి ఎన్నో బ్లాక్‌బస్టర్ హిట్స్‌ను అందించారు. ఆయన దర్శకత్వంలో గోపీచంద్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'విశ్వం' ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకురానుంది. పీపుల్ మీడియా పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ సందర్భంగా శనివారం దర్శకుడు శ్రీను వైట్ల పాత్రికేయులతో పంచుకున్న విశేషాలు...



- గోపీచంద్‌తో సినిమా చేయాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నా. ఆయన్ని దృష్టిలో పెట్టుకొని కథ సిద్ధం చేశా. యాక్షన్, కామెడీ, ఎమోషన్ అంశాలు సమపాళ్లలో మేళవించిన కుటుంబ కథా చిత్రమిది. నా శైలి కామెడీతో ఆకట్టుకుంటుంది. ఈ కథలో పాప పాత్ర చాలా కీలకంగా ఉంటుంది.
- ఈ విశ్వంలో మనకు తెలియని ఎన్నో రహస్యాలుంటాయి. ఈ సినిమాలోని హీరో పాత్ర కూడా నిగూఢమైన రహస్యాలతో సాగుతుంది. అందుకే కథానుగుణంగా ఈ టైటిల్ పెట్టాం. దర్శకుడిగా నేను కాస్త గ్యాప్ తీసుకున్నా. అయినా నేటి ట్రెండ్‌ను గమనిస్తూ, సినిమాలు చూస్తూ అప్‌డేట్ అయ్యాను. ఇప్పటి అభిరుచులకు అనుగుణంగా నా శైలి వినోదాన్ని అందించే ప్రయత్నం చేశా.
- సొసైటీలోని ఓ బర్నింగ్ ఇష్యూని తీసుకొని ఈ కథను సిద్ధం చేశా. నా గత చిత్రాల్లో హీరో తన తెలివితేటలతో ఏదైనా సాధించేవాడుగా కనిపిస్తాడు. ఆ టెంప్లెట్‌కు భిన్నంగా ఈ కథ ఉంటుంది. మేకింగ్ కూడా చాలా వినూత్నంగా ఉంటుంది. గోపీచంద్ పాత్ర భిన్న పార్శ్వాల్లో సాగుతుంది.
- ఈ సినిమాలో ట్రెయిన్ ఎపిసోడ్ హైలైట్‌గా నిలుస్తుంది. చాలా మంది 'వెంకీ' సినిమా తరహాలో ఈ ఎపిసోడ్ క్రియేట్ చేశారా అని అడుగుతున్నారు. రెండు సినిమాలకు ఏమాత్రం సంబంధం ఉండదు. కథ డిమాండ్ మేరకే ట్రెయిన్ ఎపిసోడ్ పెట్టాల్సి వచ్చింది. ఈ సినిమాలోని ట్రెయిన్ ఎపిసోడ్‌లో వెన్నెల కిషోర్, గణేష్, నరేష్, కవిత, చమ్మక్ చంద్ర, షకలక శంకర్ కడుపుబ్బా నవ్విస్తారు.
- నేటి ప్రేక్షకులు కామెడీని ఆస్వాదించే విధానం మారిపోయింది. వినోదం కోసం వారికి ఎన్నో వేదికలు అందుబాటులోకి వచ్చాయి. అందుకే కథలో కామెడీ ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నాం. నిజానికి అది చాలా కష్టమైన విషయం.
- ఈ సినిమాను తెలుగు ఆడియెన్స్ కోసం మాత్రమే తీశాను. ఒకవేళ పాన్ ఇండియాకు రీచ్ అయితే సంతోషమే. 'ఢీ' సీక్వెల్ గురించి ఇంకా నిర్ణయం తీసుకోలేదు. శ్రీహరిగారి పాత్రను రిప్లేస్ చేయడం చాలా కష్టమని నా అభిప్రాయం.

# సామాన్యుడి ప్రయాణం



వరుణ్‌తేజ్ హీరోగా రూపొందుతోన్న చిత్రం 'మట్కా'. కరుణకుమార్ దర్శకుడు. డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మాతలు. నవంబర్ 14న సినిమా విడుదల కానుంది. శనివారం విజయవాడలో ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. మట్కా కింగ్‌గా ఎదిగిన ఒక సాధారణ వ్యక్తి ప్రయాణమే ఇతివృత్తంగా ఈ సినిమా రూపొందిందని, వరుణ్‌ని ఇప్పటివరకూ చూడని కొత్తకోణంలో చూస్తారని దర్శకుడు కరుణకుమార్ చెప్పారు. ''గద్దలకొండ గణేష్' తర్వాత అలాంటి సినిమాలు చేయాలని చాలామంది అడిగారు. నానుంచి అలాంటి సినిమాలు ఆశించేవారికోసమే ఈ 'మట్కా'. 1960 ప్రాంతంలో వైజాగ్‌లో జరిగే కథ ఇది. టీజర్‌లో కొన్ని చూశారు. ట్రైలర్‌లో ఇంకొన్ని చూస్తారు. నా కెరీర్‌లో గర్వంగా చెప్పుకోదగ్గ సినిమా 'మట్కా' అవుతుంది' అని వరుణ్‌తేజ్ నమ్మకం వెలిబుచ్చారు. ఇంతకు ముందు ఓ లెక్క, ఈ సినిమా తర్వాత వరుణ్ కటౌట్ మరో లెక్క అన్న చందంగా సినిమా ఉంటుందని నిర్మాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెమెరామేన్ కిశోర్ కుమార్ కూడా మాట్లాడారు.

# యాక్షన్ ఎంటర్‌టైనర్ 'హరుడు'



వెంకట్ హీరోగా నటిస్తున్న చిత్రం 'హరుడు'. రాజ్ తాళ్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఈట ప్రవీణ్ రెడ్డి నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'యాక్షన్ ప్రధానంగా సాగే మాస్ కథాంశమిది. వెంకట్ పాత్ర శక్తివంతంగా ఉంటుంది. వినూత్నమైన కాన్సెప్ట్‌తో ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుంది' అన్నారు. తాను తొలిసారి మాస్ పాత్రను చేశానని, యాక్షన్ ఘట్టాల కోసం ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకున్నానని హీరో వెంకట్ తెలిపారు. ఇప్పటికే అరవైశాతం చిత్రీకరణ పూర్తయిందని, వచ్చే నెలలో రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నామని నిర్మాత ఈట ప్రవీణ్ రెడ్డి పేర్కొన్నారు. హెబ్బాపటేల్, సలోని, శ్రీహరి తదితరులు చిత్ర తారాగణం.

# రాజేంద్రప్రసాద్ కుమార్తె కన్నుమూత



ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొన్నది. ఆయన కుమార్తె గాయత్రి(38) గుండెపోటుతో కన్నుమూశారు. శనివారం ఛాతిలో నొప్పి రావడంతో ఆమెను హైదరాబాద్ ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గాయత్రి తుదిశ్వాస విడిచారు. రాజేంద్రప్రసాద్‌కు కుమార్తె గాయత్రితోపాటు కుమారుడు కూడా ఉన్నారు. గాయత్రిది ప్రేమ వివాహం. ఆమెకు ఓ కూతురు కూడా ఉన్నారు. చిన్నప్పట్నుంచీ గాయత్రిని రాజేంద్రప్రసాద్ ఎంతో గారాబంగా పెంచారని తెలుస్తున్నది. ప్రాణాధికంగా పెంచుకున్న కన్నబిడ్డ మరణంతో రాజేంద్రప్రసాద్ తీవ్ర నైరాశ్యానికి లోనయ్యారు. ఆయన కుటుంబం కన్నీరుమున్నీరవుతున్నది. ఈ నేపథ్యంలో పలువురు సినీరాజకీయ ప్రముఖులు రాజేంద్రప్రసాద్ కుటుంబాన్ని పరామర్శిస్తున్నారు.

**కేటీఆర్ సంతాపం:** 'సీనియర్ నటులు రాజేంద్రప్రసాద్‌గారి కుమార్తె మరణం నన్ను తీవ్రంగా బాధించింది. చిన్నవయసులోనే ఆమె కన్నుమూయడం ఎంతో బాధాకరం. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఈ కష్టాన్ని ఎదుర్కొనేంత ధైర్యాన్ని వారి కుటుంబానికి ప్రసాదించాలని ఆ దైవాన్ని వేడుకుంటున్నా. రాజేంద్రప్రసాద్‌గారు మనోనిబ్బరాన్ని కోల్పోవద్దని కోరుకుంటున్నా' అని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ (ట్విటర్) ద్వారా స్పందించారు. ఇంకా చిరంజీవి, ఎన్టీఆర్, అల్లు అర్జున్, సాయిదుర్గతేజ్, వరుణ్ తేజ్, నవదీప్, కీర్తి సురేశ్, నరేశ్ కూడా రాజేంద్రప్రసాద్ కుటుంబానికి పరామర్శించిన వారిలో ఉన్నారు.



# మనసును కదిలించే కథ

సుధీర్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మా నాన్న సూపర్‌హీరో'. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో సునీల్ బులుసు నిర్మించారు. ఈ నెల 11న విడుదలకానుంది. శనివారం థియేట్రికల్ ట్రైలర్‌ను అగ్ర హీరో మహేష్‌బాబు విడుదల చేశారు. తండ్రీకొడుకుల మధ్య అనుబంధాన్ని ఆవిష్కరిస్తూ ట్రైలర్ ఆద్యంతం హృద్యంగా సాగింది. చిన్నప్పుడే తనను వదిలేసిన తండ్రి మరలా జీవితంలోకి ప్రవేశిస్తే ఆ వ్యక్తి జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? ఈ క్రమంలో వారి మధ్య జరిగే సంఘర్షణ ఏమిటనే అంశాలతో ట్రైలర్ ఆకట్టుకుంది. సుధీర్‌బాబు, సాయిచంద్, షాయాజీషిండే పాత్రలు హైలైట్‌గా నిలిచాయి. తండ్రీకొడుకుల ప్రేమానుబంధానికి దృశ్యరూపంగా ఈ సినిమా మనసుల్ని కదిలిస్తుందని దర్శకుడు తెలిపారు. ఆర్నా, రాజు సుందరం, శశాంక్, ఆమని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జై క్రిష్, దర్శకుడు: అభిలాష్ రెడ్డి కంకర.



# దేవుడు రాసిన స్క్రిప్ట్

శ్రద్ధాదాస్, అజయ్, మాస్టర్ మహేంద్రన్ ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న చిత్రం 'త్రికాల'. 'స్క్రిప్ట్ ఆఫ్ గాడ్' ఉపశీర్షిక. మణి తెల్లగూటి దర్శకుడు. రాధికా శ్రీనివాస్ నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను అగ్ర నిర్మాత దిల్ రాజు ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ 'హారర్ కథాంశమిది. కుమారి ఖండం అనే పురాణంలోని మూలకథను తీసుకొని ఆధునిక హంగులు మేళవించి ఈ సినిమాను తెరకెక్కించాం. శ్రద్ధాదాస్ పాత్ర ప్రధానాకర్షణగా నిలుస్తుంది. అబ్బురపరిచే గ్రాఫిక్స్‌తో సరికొత్త సినిమాటిక్ అనుభూతినందిస్తుంది' అన్నారు. తనికెళ్ల భరణి, ఆమని, అర్జున్ అంబటి, ఐశ్వర్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, దర్శకత్వం: మణి తెల్లగూటి.



# కాలంతో చేసే ప్రయాణం

సాయిరోనక్, అమృత చౌదరి జంటగా నటిస్తున్న చిత్రం 'రివైండ్'. స్వీయ దర్శకనిర్మాణంలో కల్యాణ్ చక్రవర్తి రూపొందిస్తున్నారు. ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకురానుంది. శనివారం ఈ చిత్ర ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకనిర్మాత మాట్లాడుతూ 'టైం ట్రావెల్ మీద తీసిన లవ్‌స్టోరీ ఇది. సైంటిఫిక్ ఫిక్షన్ జోనర్‌లో ఆకట్టుకుంటుంది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది. విభిన్న ఇతివృత్తంతో ప్రేక్షకులకు కొత్త అనుభూతినందిస్తుంది' అన్నారు. మంచి కంటెంట్‌తో వస్తున్న ఈ సినిమా తప్పకుండా కొత్త ఫీల్‌నిస్తుందని హీరో సాయిరోనక్ చెప్పారు. సురేష్, జబర్దస్త్ నాగి, కేఏ పాల్‌రామ్, అభిషేక్, ఫన్ బకెట్ రాజేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శివరామ్ చరణ్, సంగీతం: ఆశీర్వాద్, నిర్మాణం: క్రాస్ వైర్ క్రియేషన్స్, నిర్మాత, దర్శకత్వం: కల్యాణ్ చక్రవర్తి.

